# జీవితాదర్శం

సంజీవయ్య పార్క్‌లో దూరంగా ఒక చెట్టు కింద గడ్డిలో కూర్చున్నారు సుహాసిని - నందగోపాల్. దగ్గరలో జన సంచారం పెద్దగా లేదు. కూర్చున్నప్పట్నించీ ఇద్దరూ మాట్లాడటానికి సాహసించట్లేదు. అలాగని ప్రేమభావాలతో వారి మనసులు ఉక్కిరిబిక్కిరై పోతున్నాయని కాదు. ఎవరు ఏ మాట ఎలా మొదలు పెట్టాలీ - ఎలా మాట్లాడటం మొదలు పెట్టాలా అని తెలుసుకోలేని స్థితి.

ఏడాది క్రితం ఈ పార్క్‌లోనే ఎన్నోసార్లు ఉరకలు వేసే ఉత్సాహంతో కలుసుకున్నారు. ఎన్నో చర్చించుకున్నారు. ఎన్నో అభిప్రాయాలు పంచుకున్నారు. ఆదర్శాలు కలబోసుకున్నారు. టీలు తాగారు. చాట్‌లు తిన్నారు. ఇళ్ళకు వెళ్ళిపోయినా సెల్‌ఫోన్‌లో ఎడతెరిపి లేకుండా సంభాషణలు సాగించుకున్నారు. గుసగుసలు - కిసుక్కునవ్వులు - ప్రమాణాలు - ప్రేమ ఊసులు - ఒకటేమిటి ఎన్నో కబుర్లు - ఎంత స్నేహం - ఎంత ప్రేమ - పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. పెద్దవాళ్ళని ఒప్పించాలనే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

నిజానికి వాళ్ళిద్దరూ మొదటిసారిగా పార్క్‌లోనో, పబ్‌లోనో, సినిమా హాల్లోనో, సింహాచలం కొండమీదనో కలుసుకోలేదు. నందగోపాల్ ఫ్రెండ్ కిరణ్‌కుమార్‌కి ఫేషియల్ వీక్‌నెస్ వచ్చి మూతి వంకర తిరిగిపోయింది. ఎడమ వైపు మూతి కుడివైపు చెవిదాకా వచ్చేసింది. అర్జెంట్‌గా డాక్టర్ దగ్గరికి ఆయన సలహా మేరకు ఫిజియోథెరఫీ సెంటర్‌కి పరిగెడుతున్నప్పుడు - ఆ సెంటర్లో కిరణ్ చెవికి హీటింగ్ పెట్టే థెరపిస్టుగా సుహాసిని పరిచయమయ్యింది నందగోపాల్‌కి. వరసగా పన్నెండు రోజులు కిరణ్‌ని ఆ ఫిజియోథెరఫీ సెంటర్‌కి తీసుకెళ్ళే బాధ్యత నందు మీద పడింది.

ఆసక్తికరమైన విషయమేమిటంటే కిరణ్‌కుమార్ పాతికేళ్ళ పడుచుకుర్రాడు. సంపూర్ణ ఆరోగ్యం గలవాడు. ఇలాంటి ఒక ఉపద్రవం రావడానికి అస్సలు అవకాశం లేనివాడు. అయితే మరెందుకొచ్చింది? అతనికీమధ్యనే పెళ్ళికుదిరింది. ఆ అమ్మాయి న్యూజెర్సీలో ఉద్యోగం చేస్తోంది. ఇక్కడమ్మాయే. చదువుకూడా ఇక్కడే చదివింది. ఫార్మసీ చేసిన ఆమెకి అక్కడ ఉద్యోగం వచ్చింది.

పెళ్ళిచూపుల తతంగం – మాటలు – కట్నాలూ – కబుర్లూ – అన్నీ పూర్తయి పెళ్ళి స్థిరపడింది. ఆమె రావాలి. పెళ్ళి జరగాలి. ఆ శుభ సందర్భంగా ఆ రోజు కిరణ్‌కుమార్ ఆమెతో ఉదయం ఆరు గంటల నుండి పదకొండు గంటల వరకూ ఏకధాటిగా సెల్‌ఫోన్లో మాట్లాడాడు. కాబోయే లైఫ్ పార్ట్నర్ కదా – సుదీర్ఘ సంభాషణ ఫలితంగా అతనికి మూతి వంకరపోయి మూర్ఛవచ్చినంత పనయ్యింది.

అలాంటి సమయంలో కలుసుకున్న సుహాసినీ, నందగోపాల్ మధ్య కబుర్లెలా వుంటాయో అలాగే వున్నాయి – ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి – సెల్‌ఫోన్ల ఉపయోగం గురించీ, దానివల్ల వచ్చే బ్యాడ్ ఎఫెక్ట్స్ గురించీ – కబుర్లే కబుర్లు. సెల్‌ఫోన్లు గుండె దగ్గరగా ఉండకూడదనీ – ఎక్కువసేపు మాట్లాడకూడదనీ అక్కడక్కడా జాగ్రత్తలు వినిపిస్తూ ఉన్నా, అందరూ సెల్‌ఫోన్ల మోజులో కొట్టుకు పోతున్నారు. ప్రతి యువకుడూ, యువతీ, స్టూడెంట్సూ ఎడమ చెయ్యి చెవిదగ్గర అతికి పెట్టేసుకుంటున్నారు. బండి నడుపుతున్నా చెవిలో ఫిక్స్ అయిపోయిన సెల్‌ఫోన్ దాని పని అది చేసుకుపోతూనే వుంటోంది. అందరూ ఎదుటి వాళ్ళకి జాగ్రత్తలు చెప్పేవాళ్ళే అన్నట్టుగా తయారయ్యింది వ్యవహారం.

కిరణ్‌కుమార్ మాత్రం భయపడిపోయి, బిక్కచచ్చిపోయి, కుదిరిన పెళ్ళి ఆగిపోతుం దేమోనని నిరాశ పడిపోయి, తను వెళ్ళాలని ఉవ్విళ్ళూరుతున్న యూ.ఎస్ ప్రయాణం ఏమైపోతుందోనని బెంగ పెట్టేసుకుని పిచ్చిచూపులు చూడటమే తప్ప మాటలు మర్చిపోయిన వాడిలా వుండిపోయాడు.

సుహాసిని ఫిజియోథెరఫీయే కాకుండా, మానసిక మాంద్యంతో మనసూ, ఆలోచనా ఎదగని పిల్లల్ని ఎటెండయి వాళ్ళని ట్రీట్ చేసే కోర్స్ కూడా చేసింది. ఆమెకి అలాంటి పిల్లలంటే ఎనలేని జాలి, ప్రేమ.

"మనసు ఎదగని, ఆలోచనలేని పిల్లలకు ఏదైనా చెయ్యాలనేదే నా జీవితాదర్శం" అని చెప్పింది సుహాసిని. ఆమె మాటలు వినగానే నందగోపాల్‌కు

ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. నిరాశతో కృంగిపోతున్న అతనికి ఒక ఆసరా దొరికినట్లనిపించింది. ఆ తర్వాత సుహాసిని చాలా దగ్గరయ్యింది అతనికి. ఆమె తన బాధ్యతలో పాలు పంచుకోగలదని ఆశ మొదలయ్యింది.

❖ ❖ ❖

శరూ... శరూ... అంటూ ముద్దుగా పిలుస్తోంది నాగమణి కూతుర్ని. శారద తల్లివైపు చూస్తూ వెర్రిగా నవ్వుతూ పిచ్చిపిచ్చి శబ్దాలు చేస్తూ, పక్కకి ఒరిగిపోతూ, కాళ్ళు నిలవకుండా – అది పరుగో, నడకో తెలియని స్థితిలో వెళ్ళి తల్లిమీద పడింది. నాగమణి ఆ బరువును తట్టుకోలేక వెనక్కి ఒరిగిపోయింది. ఆ ఒరగడంలో చెయ్యి బిందెకు తగిలి అది దొర్లిపోయింది. నీళ్ళన్నీ ఒలికిపోయి, ఇల్లంతా మడుగులా అయిపోయింది. నెమ్మదిగా లేచి చీర పిండుకుని పిల్లని పట్టుకుంది.

ఆ శారదకిప్పుడు ముప్పై ఏళ్ళు. ఒక్క మాట రాదు– చెప్పిన మాట అర్థం చేసుకోలేదు – పెంకితనం – కొన్ని భావాలు నటనతో, కేకలతో, బొబ్బలతో, రకరకాల శబ్దాలతోచెప్తుంది. అవి బాగా అలవాటున్న ఇంట్లో వాళ్ళకే అతికష్టం మీద అర్థమవుతాయి. ఆ పిల్లకి అన్ని పనులూ తల్లి చేయవలసిందే. ఆడపిల్ల కావడం వల్ల మరీ అంటిపెట్టుకుని చెయ్యాలి. ఆ తల్లి పాతికేళ్ళగా ఏ సుఖమూ, శాంతీ లేకుండా ఆ పిల్లని సాక్కుంటూ కాలం గడిపేస్తోంది. ఎక్కడికీ వెళ్ళడానికి లేదు. ఓ పెళ్ళి – పేరంటం – మంచీ – చెడ్డా ఆమెకి లేకుండా పోయాయి. ఎప్పుడూ పిల్లని వెంటేసుకుని దానికి మందులేస్తూ, ముడ్డీమూతి కడుగుతూ దాన్ని బతిమాలుతూ జాలిపడుతూ, ముద్దుచేస్తూ, విసుక్కుంటూ, ఏడుస్తూ, రాగాలు పెడుతూ గడిపేస్తోంది.

ఆమె బాధలో వాటా పంచుకుంటూ సుందరరామయ్య శారదని విపరీత గారం చేస్తూ "నా బంగారుతల్లీ – మా ఇంటి మహాలక్ష్మి– మా కంటి జ్యోతి" లాంటి మాటలతో ఆ పిల్లని ముద్దుచేస్తూ, మురిసిపోతున్నట్లు అధిక ప్రసంగం చేస్తుంటాడు.

శారదకి ఐదేళ్ళు వచ్చాక ఆమె బుర్ర ఎదగలేదని గ్రహించారు. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఎన్నిదేవుళ్ళకి మొక్కినా ఎన్నిమందులు వాడినా ప్రయోజనం లేకపోయింది. వెన్ను ముదిరితే కొంతమార్పు ఉండవచ్చునని చెప్పారు. మందులు మాత్రం పుష్కలంగా ఇచ్చారు. ఆ మందుల వల్ల ఒళ్ళు బాగా పెరిగిపోయింది. బుద్ధి సరిగా లేకపోవడం వల్ల బాగా నిలబడలేక పోవడం, తూలిపోవడం సహజమై

పోయాయి. కళ్ళు నిలకడలేని చూపుతో ఉంటాయి. ఒక్కమాట కూడా రాలేదు. అన్నీ అరుపులూ– కేకలే.

శారద తర్వాత ఐదేళ్ళకి నందగోపాల్ పుట్టాడు. ఆ పిల్లాడు మామూలుగా ఉన్నాడని నిర్ధారణయ్యే వరకూ ఆ భార్యాభర్తల ఆందోళన చెప్పనలవి కాదు. నెమ్మదిగా నందు ఆటపాటలతో కాస్తతెరిపిన పడ్డారు. మరో మూడేళ్ళకు బాలచంద్ర పుట్టాడు. ఆ పిల్లాడు కూడా సవ్యంగా ఉండేసరికి వాళ్ళకి ఊపిరి తిరిగింది.

శారదని జాగ్రత్తగా, దాని బతుకంతా చూడటమే వారి బాధ్యతగా పెట్టుకున్నారు.

ఇద్దరు కొడుకుల్నీ అన్నాలకి కూర్చోపెట్టుకుని "మేము శారదక్కని జీవితాంతం జాగ్రత్తగా చూస్తాం" అని ప్రమాణం చేయించి మొదటి ముద్ద తినిపించేది నాగమణి. క్రమంగా వారు ఎదుగుతూ, అదొక మంత్రంగా జపిస్తూ వస్తున్నారు. నందూ చాలా శ్రద్ధగా ఉండేవాడా విషయంలో – చందు మాత్రం అకతాయిగా "నేనా పిచ్చిదాన్ని చూడను" అనేవాడు – తల్లిచేత, తండ్రి చేత తన్నులు తినేవాడు.

❖ ❖ ❖

జారిపడిన శారదని లేవనెత్తడం నాగమణి వల్ల కాలేదు. పనిమనిషి సాయం చేసింది. లేస్తూనే ఆమెనొక తోపు తోసింది శారద. ఆమె వెళ్ళి ఆమడ దూరంలో పడింది. మోచేతులు డోక్కుపోయాయి. తలకి దెబ్బ తగిలింది.

'ఛీ! ఇదెక్కడి పిల్లమ్మా! దెయ్యప్పిల్ల' అంటూ అది లేచి దెబ్బలు చూసుకుని నీళ్ళతో కడుక్కుంటూ బాగా విసుక్కుంది. నాగమణి పని మనిషి మీద గయ్యిమని లేచింది. "అది నోరు లేని పిల్ల. దానికి ప్రపంచమే తెలీదు. దాన్నేమైనా అంటే ఊరుకోను" అంటూ అరిచింది.

"కాస్తయినా బయం చెప్పకపోతే ఎలాగమ్మా? మీరైనా బతకాలికద" అంటూ ఎదిరించింది – నాగమణి నానా మాటలూ అని పని మనిషితో గొడవ పెట్టుకుంది. చివరగా రుసరుసలాడుతూ "ఇష్టముంటే పని చెయ్యి లేకపోతే మానెయ్యి. అంతేగానీ, శరూని ఏమైనా అంటే ఊరుకునేది లేదు" అంటూ నాగమణి తేల్చింది.

"సరేనమ్మా" అంటూ ఆమె ఎక్కడ పని అక్కడ వదిలేసి పోయింది. వెనకనించి చప్పట్లు కొడుతున్న కూతుర్ని చూసిన ఆమెకి కోపం కట్టెలు తెంచుకుంది. వెళ్ళి నాలుగు బాదింది. తిట్లు తిట్టింది. అది ఏడ్చింది. తనూ ఏడుస్తూ కూర్చుంది.

సరిగ్గా అప్పుడే ఇంట్లో అడుగ పెట్టాడు నందూ - శారద గబగబా వచ్చి తమ్ముణ్ణి వాటేసుకుంది. ఏదో మాటల్తో చేతల్తో తల్లిమీద నేరం చెప్పింది. నందుకి అర్థమయ్యింది.

"అమ్మని నే కొడతాలే" అంటూ ఊరడించాడు. శారద ఆనందంగా కేరింతలు కొట్టి, చప్పట్లు కొట్టి, నేలమీద పడి దొర్లింది. నందూకి మనసు కలతపడింది. తల్లిమీద జాలివేసింది. సుహాసిని వస్తే అమ్మకి ఎంతో సాయంగా ఉంటుందన్న ఊహ అతనికి ఊరటగా అనిపించింది. శిక్షణ పొందిన సుహాసిని బాగా హ్యాండిల్ చెయ్యగలదు అనుకున్నాడు.

ఆ రోజు రాత్రి తల్లితో సుహాసిని సంగతి చెప్పాడు. నాగమణి శోకాలు మొదలుపెట్టింది. సుందరరామయ్య ఏమీ అర్థం కాక కంగారు పడ్డాడు.

'నర్సు పిల్లని కోడలుగా తెస్తావేంటిరా' అంటూ రాగాలు మొదలు పెట్టింది. నందూ ఎంతో సేపు తల్లిని సముదాయించాడు. తండ్రి ఎటూ తేల్చి ఏమీ చెప్పలేక పోయాడు.

సంప్రదాయసిద్ధమైన పిల్లంటే - కాళ్ళకి పసుపు - ముఖాన మూడు నాలుగు బొట్లు - మెడలో నల్లపూసలు - చేతినిండా ఎర్ర గాజులు - పొందికైన చీర - జడలో ఒకటో, రెండో పూలు - వినయాభినయం - ఉండాలని నాగమణి ఊహ.

చాలా తర్జనభర్జనలు నడిచాక పిల్ల బాధ్యత ఆనందంగా స్వీకరిస్తుందన్న ఆశతో చివరకి సరేనన్నారు.

అయితే సుహాసిని తల్లి తాయరమ్మా మాత్రం ఒప్పుకోలేదు. "ఇదేమిటి - పెళ్ళి పేరుతో ఒక గుదిబండను కట్టుకుంటున్నావు" అంటూ అభ్యంతరం చెప్పింది. "పెళ్ళి సరే! ఆ పిల్లేమిటి" అంటూ వాపోయింది. సుహాసిని తన ఆదర్శం గురించీ, తన ఆలోచన గురించి బాగా చెప్పి ఒప్పించింది.

పెళ్ళి జరిగిపోయింది. అల్లుణ్ణి చూసి తాయారమ్మా మురిసిపోయింది. వీళ్ళు పెద్దగా కట్నం ఆశించలేదు. నాగమణి అసంతృప్తి చెందకుండా అన్ని లాంఛనాలు ఘనంగా జరిపించారు. ఆమె కూడా తృప్తిగా సంతోషపడింది. ఇంట్లో మొదటి శుభకార్యమని అందరూ ఎంతో ఆనందపడ్డారు.

సుహాసిని ఇంట్లో అడుగు పెట్టగానే శారద ఆమెని వాటేసుకుని వదల్లేదు. అందరూ సంబరపడ్డారు. దానికెంత పిచ్చి ప్రేమోనని మురిసిపోయారు.

కొంత సమయమయ్యాక సుహాసిని జడలో పూలన్నీ పీకేసింది. జుట్టంతా రేపేసింది. శారదని కంట్రోల్ చెయ్యాలని అందరూ సున్నితంగా ప్రయత్నించారు. కానీ సుహాసిని నుంచి శారదని విడదీయడమే గగనమై పోయింది. అందరి మనసులూ చికాకుపడినా ఏలాగో సర్దుకున్నారు. ముందుగా తేరుకున్నది సుహాసినియే. ఆమెకి కొంత అర్థమైంది. శారద ప్రవర్తనలో విపరీతమైన మార్పు వచ్చింది. నందూ, సుహాసినీ ఒక చోట ఉంటే చాలు, వాళ్ళిద్దరి మీదపడి రక్కేసేది. ఇంక రాత్రి వాళ్ళు గదిలో తలుపు వేసుకుంటే చాలు, తలుపులు దబదబా బాదడం మొదలుపెట్టింది. తీసే వరకూ నానా అల్లరిచేసి, గోల చేసేదింది. అందరూ ఏం చెయ్యాలో తోచక కంగారుపడ్డారు.

"నాయనా, నందూ!!! దానికింకా అలవాటు పడలేదు. నాలుగు రోజులు సర్దుకోండి. సుహాసినిని బయటే పడుకోమంటాను" అంది నాగమణి. సుహాసిని వెంటనే అర్థం చేసుకుని తను అత్తగారి పక్క మంచం వేసుకుంది. శారద వచ్చి ఆమె పక్కన జేరింది.

శారద ఎవ్వరేం చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో లేదు. మాట వినదు. పెంకితనం వీడదు. ఆమె మాట వినేట్టు,పంతం విడిచేట్టు చెయ్యాలి అనుకుంది సుహాసిని.

వీటన్నిటికీ మించి స్త్రీ, పురుష సంబంధం గురించి చెప్పలేని బాధ ఏదో ఆమె లోపలుందని సుహాసినికి అర్థమయ్యింది - ఏమీ తెలియకపోయినా సెక్స్ సంబంధించిన ఏదో సెన్స్ పనిచేస్తోందనిపిస్తోంది. దాన్ని వ్యక్త పరచడానికి నానా బీభత్సం చేస్తోంది.

శారద నానాటికీ రెచ్చిపోతోంది - నందు, సుహాసినీ కలిసి ఎక్కడికైనా, ఆఫీసుకైనా బయల్దేరుతే, సుహాసిని పట్టుకుని ఒళ్ళంతా గీరేసి, రక్కేసి రభస చేస్తోంది.

ఆ రోజు ముగ్గురు కలిసినా శారదని పట్టుకుని లాగలేక పోయారు. సుహాసినికి గోళ్ళు గుచ్చుకుని రక్కుకుని : పోయింది. నందగోపాల్ ఈ విపరీత పరిణామానికి ఖిన్నుడైపోయాడు. ఆమెని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

"ఇదేమిటి? ఇంత డ్యామేజ్ అయ్యే వరకూ ఇంట్లో వాళ్ళేం చేస్తున్నారు" అంటూ కేకలేసి సుహాసినికి ఇంజంక్షన్ చేసి, కొన్నిచోట్ల ప్లాస్టర్లు వేసి, ఆయింట్‌మెంట్ రాసి పంపాడు.

ఇద్దర్నీ చూసిన తాయారమ్మా గొల్లుమంది. "ఇంకా అత్తారింటికి వెళ్ళద్దు" అంటూ గోల చేసింద. సుహాసిని మాత్రం డాక్టరు చెప్పిన మాటలు పదే పదే గుర్తు చేసుకుంది.

"ఇలా మానసిక మాంద్యం ఏర్పడిన వార్ని ప్రేమగా చూస్తూనే కొంచెం భయం కూడా చెప్పాలి. కొట్టాలని కాదు. కొట్టకూడదు. కానీ వారు భయపడి, ఆగే ఒక మెకనిజం ఉండాలి. లేకపోతే వాళ్ళని కంట్రోల్ చెయ్యడం చాలా కష్టం. కానీ కంట్రోల్ చెయ్యాల్సిన అవసరం ఎంతో ఉంది.

కళ్ళెర్రజేస్తే వాళ్ళు ఆగే విధంగా వాళ్ళని చూడాలి. వాళ్ళకు సామాన్య విషయాలు బోధించాలి. అది కూడా విసుగు చెందకూడదు. వాళ్ళ మీద విసుగు ప్రదర్శించకూడదు. వారిని ప్రేమిస్తున్నామని వారికి అర్థమయ్యే విధంగా ప్రవర్తించాలి. అలాగే వారిని కోప్పడుతున్నామని అర్థమయ్యేలా ప్రవర్తించాలి. ఇది చాలా సీరియస్ ప్రాసెస్. ఓర్పుతో చెయ్యాల్సిన పని – చేసిన పనికి త్వరగా ఫలితం కనిపించదు" డాక్టర్ కేశవరావు ఎంతో – శ్రద్ధగా తను స్టడీ చేసినదంతా చెప్పాడు.

తను అర్థం చేసుకున్న దాన్ని ప్రాక్టికల్‌గా ఎలా కార్యరూపంలో పెట్టాలా, ఎక్కడ్నించీ మొదలు పెట్టాలా అని సుహాసిని ఆలోచనలో పడిపోయింది.

ఆయన దగ్గరకెప్పుడెళ్ళినా ఇలాంటి పేషెంట్‌ని ఎలా ట్రీట్ చెయ్యాలి అనే విషయాలు కొత్తకొత్తగా చెప్తూనే ఉంటారు.

ప్రాక్టికల్‌గా చెయ్యవలసి వచ్చినప్పుడు కష్టాలున్నా వాటిని అధిగమించి ఓర్పుగా చేస్తేనే ఫలితం వస్తుంది. ఈ ఫలితం కూడా చాలా స్లోగా వస్తుంది. అందుకే ఓర్పుగా పని చెయ్యాలి. విసుగు చెందితే పని జరగదు. – ఫలితం ఉండదు.

డాక్టర్ చెప్పే మాటల్ని పదే పదే తల్చుకుంటోంది సుహాసిని.

సుహాసిని శారదని శిక్షణలో పెట్టబోయి బాగా భంగ పడింది. ఆమె చేత డ్రాయరు తొడిగించాలని ప్రయత్నిస్తూ అరగంట సమయం గడిపింది. నాగమణికి విసుగొచ్చేసింది. కోడలు మీద ఒంటికాలు మీద లేచింది.

"అది మతి లేనిదని తెలిసి దాన్నలా హింసిస్తే నేనూరుకోను. ఏం వేళాకోళంగా ఉందా? పాతికేళ్ళనించీ దాని పనులది చేసుకోలేకపోతుంటే ఈ రోజు కొత్తగా మొదలు పెడతావేంటి" అంటూ దులిపింది.

"అది కాదత్తయ్యా! దానికి నెమ్మదిగా నేర్పిస్తే కొన్నాళ్ళకయినా వస్తుంది. నేర్పించకపోతే ఎప్పటికీ రాదుకదా"

"నా కూతురు చేతకానిదని మళ్ళీ మళ్ళీ నాకు గుర్తుచెయ్యాల్సిన అవసరం లేదు. నాకు తెలుసు. నువ్వేం దానికి నేర్పించీ, ఉద్ధరించాల్సిన పని లేదు" అంటూ

రుసరుస లాడుతూ కూతురుకి డ్రాయరు తొడిగేసింది. సుహాసిని నిస్సహాయంగా నిలబడిపోయింది.

కాఫీ పట్టించడం - అన్నం తినిపించడం - మంచినీళ్ళు తాగించడం - మూతి కడగటం అన్నీ నాగమణీ చకచకా చేసేసి కోడలివైపు విజయగర్వంతో చూసేది.

శారదకి తెలిసేలా చేయడం కష్టం గానీ, మనమే చేయడం కష్టం కాదు అనే విషయం నాగమణికి ఎంత చెప్పినా అర్థం కాలేదు. కోపమొచ్చిన శారద నీళ్ళ గ్లాసు సుహాసిని ముఖానేసి కొట్టింది. అదృష్టం కొద్దీ, కాస్తలో తప్పిపోయి నీళ్ళు ముఖం మీద పడి గ్లాసు కింద పడిపోయింది. నందుకి చాలా కోపం వచ్చింది. శారదని ఒక్క చెంపదెబ్బ వేశాడు.

"పాతికేళ్ళనించీ అనుభవిస్తున్నా - ఒక్క నెల్లాళ్ళకే మీకింత కష్టం కలిగి కోపం వస్తే ఏమనాలి? దాని విషయం మీ ఇద్దరూ పట్టించుకుంటే నా మీద ఒట్టే" అంటూ రెచ్చిపోయింది.

"అదేమిటీ - నువ్వు పాతికేళ్ళు పడ్డావు - సరే - మేమూ అలాగే పడాలానా - దాన్ని కాస్త సరైన పద్ధతిలో పెట్టాలని చూస్తే పడనివ్వవే?" అంటూ అరిచాడు.

"నీ పెళ్ళామంటే నీకంత అపూరూపమైతే పో. నాకు నర్సు కోడలొద్దు. నాకు కావల్సింది నా కూతుర్ని జాగ్రత్తగా నేను చూసుకున్నట్టు చూసుకునే మామూలు కోడలు కావాలి - దీన్ని ఏ హాస్పిటల్‌లోనో ఒదిలేయ్" అంటూ నాగమణి ఇష్టమొచ్చినట్లు మాట్లాడేసింది.

ఇంట్లో వాతావరణం దుర్భరమైపోయింది. సుహాసిని ఏది చేసినా చెయ్యకపోయినా ఇబ్బందిగానే ఉండేది. అందరూ సుహాసినిదే తప్పు అనే ధోరణిలో ఉండేవారు - 'మతి లేని పిల్లకి ట్రైనింగ్ ఏమిటి? జాగ్రత్తగా అన్నీ చేసి భరించాలి గానీ' అంటూ అనుకునేవారు. నందగోపాల్‌కి కూడా అదే కరెక్ట్ అనిపించేది. ఏదో కొంత టైమ్ కేటాయించి దానికి చేసేదేదో చేసి బయట పడాలిగానీ, ఈ శిక్షణా, సంస్కరణా మన వల్ల అయ్యే పని కాదు - ఈ విధంగా చేస్తే మన జీవితాలు చాలవు అనిపించి, సుహాసినితో వాదనకి దిగేవాడు.

సుహాసిని అయోమయంలో పడిపోయింది. తానేదో ఊహించి ఈ పెళ్ళి చేసుకుంది. జీవితం - ఆదర్శం కలిసిపోతాయని కలలు కంది. కానీ వాస్తవం వేరుగా కనిపిస్తోంది. తనూ హోమ్‌లో ఉద్యోగంలో జేరిపోయినా ఇంతకంటే తృప్తి

లభించేది. నందూకి కూడా తన మీద ఆసక్తిపోయిందని గ్రహించే సరికి జీవితం మీద ఆశ, మనసు చచ్చిపోయినట్లనిపించింది. నందు తనతో కలిసి జీవించడానికే ఉత్సాహం చూపించడం లేదనిపిస్తోంది.

❖ ❖ ❖

చివరకెలాగో గొంతు పెగుల్చుకుని "అయితే మన విడాకులే దీనికి పరిష్కార మనుకుంటున్నావా?" అంది సుహాసిని.

"నేను అమ్మని కష్టపెట్టలేను. చిన్నప్పట్నించీ ఆమెకిచ్చిన మాటను నీ కోసం వదులుకోను" అన్నాడు నందు.

"వదులుకోవడమేమిటి? నీ మాట కోసమే కద నేను కష్టపడుతున్నది!"

"వద్దులే. నువ్వంత కష్టపడద్దు – మనం కలిసుండటం కుదిరే పని కాదు"

అవమానంతో ఆమె కళ్లలో నెమ్మదిగా నీరూరటం మొదలయ్యింది. విషయం తెలుసుకుని డా. కేశవరావు కోపంతో ఊగిపోయాడు. చిందులు తొక్కేశాడు. ఎదురుగా ఉన్న సుహాసినిని పట్టించుకోకుండా గట్టిగా అరుస్తూ అందర్నీ ఇంగ్లీష్‌లో నానా తిట్లు తిట్టేశాడు. ఆమె హడలిపోయింది. డాక్టరు ఇంత పెద్దగా అసలెప్పుడైనా మాట్లాడతారా అని కంగారు పడింది. ఇంతకుమునుపు ఎంత సీరియస్ సంగతి వచ్చినా నెమ్మదిగా, మెత్తగా, చిన్నగొంతుతో చెప్పేవాడు. అలాంటిది ఆయనిలా అరుస్తూంటే భయంతో పాటు ఆశ్చర్యం వేస్తోంది.

డాక్టరు కేశవరావు సుందరరామయ్యని పిలిచి చివాట్లు వేశాడు. డాక్టరుకేం సమాధానం చెప్పలేక ఇంటిగుట్టు రట్టు చేసినందుకు కోడలి మీద కోపం తెచ్చుకున్నాడు – అయితే తన కోపం బయట పెట్టే ధైర్యంలేక నోరు మూసుకుని ఊరుకున్నాడు. అందరూ కేశవరావు ధాటికి హడిలిపోయారు.

అప్పట్నించీ సలహాలూ, సంప్రదింపులూ, రాయబారాలూ ఎన్నో సాగాయి. తాయారమ్మ అసలు సంసారమే ఒద్దని గొడవ చేసింది. వివాహ జీవితం మీద విరక్తి కలిగినా, తను నమ్మిన ఆదర్శం వల్లనే తను ఓడిపోవడం సుహాసినికి భరించలేకుండా ఉంది.

అంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ విధంగా సుందరరామయ్యను, నాగమణిని ఒప్పించారు. అదేమంటే వారిద్దరూ ఉత్తర దేశ యాత్రకి వెళ్ళి పుణ్య క్షేత్రాలన్నీ దర్శించుకొచ్చేట్టూ, – ఆ సమయంలో సుహాసినీ, నందగోపాల్ శారదని

చూసేట్టూ - వారికి చందూ సాయంగా ఉండేట్టు నిర్ణయమయ్యింది. నాగమణి మొదట్లో కాస్త మొరాయించినా గుమ్మం కదిలి ఎన్నాళ్ళో అయ్యి ఉండటం వల్ల ఒప్పుకుంది.

శారదకి ఏ లోటూ రానీయనని నందూ చేత చేతిలో చెయ్యి వేయించుకుంది. డాక్టరు సలహాతో, శారదని మెంటల్లీ రిటార్డెడ్ హోమ్‌లో జేరిపించారు. అక్కడే సుహాసినికి ఉద్యోగం కూడా కుదిరింది.

ఒక వారం రోజులు ఆమెతో నరకమే కళ్ళ జూసినా, తోటి నర్సుల సహాయంతో సుహాసిని మేనేజ్ చెయ్యగలిగింది.

నెమ్మదిగా శారదలో కొంచెం మార్పు రావడం మొదలయ్యింది. ఇంతవరకూ ఆమెకు ఏ విధమైన శిక్షణా లేకపోవడం వల్ల, మొండిగా, మొద్దుగా, పెంకిగా తయారయ్యింది. ఇప్పుడు ఆమెకి కొంత ఆలోచనా, అర్థం చేసుకునే శక్తి ఉన్నాయోమో నసే ఆశ అందరికీ కలిగింది. ఒక్కొక్కసారి పోట్లాడినా తోటిపిల్లలతో కేరింతలు కొట్టడం, ఏదో ఆడడం, అరవడం - అందరితో కలిసి తినడం - తాగడం, ఇంకా కొన్ని పనులు చేతకాకపోయినా చేసుకోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించాయి. ముఖ్యంగా నందూకి మరీ -

శారద కొంచెం కూడా ఎదగకపోవడానికి మనమే కారణమా అనే బాధ అతనికి కలిగింది.

మూడు నెలల్లో చెప్పుకోదగిన మార్పు శారదలో కనిపించింది. ఊళ్ళో దిగుతూనే హోంకి పరిగెత్తుకెళ్ళింది నాగమణి. శుభ్రంగా, పద్ధతిగా బట్టలు కట్టుకుని, తల దువ్వుకుని ఉన్న కూతుర్ని చూసి సంతోషించకుండా ఉండలేకపోయింది. కొంచెం చిక్కినా తీరుగా ఉన్నట్లు అనిపించింది.

"శారద నీట్‌గా ఉంది కదూ" అన్నాడు సుందరరాయమ్య.

"నిజమే" అంది నాగమణి.

ఒక బకెట్టులో ఉన్న నీళ్ళని చిన్న మగ్గుతో తీసుకెళ్ళి మొక్కలకి పోస్తున్న శారదని చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. అమ్మని చూసి కాస్సేపు కేరింతలు కొట్టింది. తండ్రిని పట్టుకుని వేళ్ళాడింది.

కోడల్ని ప్రేమగా పలకరించింది నాగమణి. "బాగున్నావా" అంటూ.

"అమ్మా! ఇంకా కొన్నాళ్ళిక్కడుంటే శారద మామూలు అమ్మాయై పోతుంది" అన్నాడు డాక్టరు కేశవరావు.

భార్యాభర్తలేం మాట్లాడలేకపోయారు. వాళ్ళకి కాస్త సిగ్గనిపించింది.

"నందూ! ఇప్పుడు నువ్వనుకున్నట్టు కోర్టు ద్వారా విడాకులకి అప్లై చెయ్యి" అంది సుహాసిని సీరియస్‌గా.

"నన్నింక చంపకు, సుహా" అన్నాడు నందగోపాపల్.

"నేనెప్పుడో చచ్చిపోయాను - ఇంక నిన్నేం చంపగలను!"

"సారీ, సుహా... నన్ను క్షమించు"

సుహాసిని అతనికేం సమాధానం చెప్పకుండా అక్కడ్నించీ వెళ్ళిపోయింది.

●